విద్యార్థినికి కలెక్టర్ అభినందనలు

విద్యార్థిని మమతను అభినందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, జూన్ 7 : తాండూర్‌లోని కేజీబీవీ విద్యార్థిని దుర్గం మమత ఇంటర్‌లో రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్, జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించగా, కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. ముమ్ముందు మరిన్ని మంచి ఫలితాలు సాధించి, ఉన్నతస్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, కళాశాల ప్రత్యేకాధికారి సుమనచైతన్య, సుధారాణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనుల పరిశీలన

కాసిపేట, జూన్ 7 : కాసిపేట మండలం దేవాపూర్ కాంప్లెక్స్ పరిధి పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ శుక్రవారం పరిశీలించారు. దేవాపూర్ పోలీస్‌స్టేషన్ బస్తీ, మహేంద్ర బస్తీ దేవాపూర్ పాఠశాలలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ, మైనర్ రిపేర్లు, టైల్స్, వాటర్ పనులను పర్యవేక్షించారు. అన్ని పనులు పాఠశాలలు ప్రారంభానికి ముందే పనులు పూర్తిచేయాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ, కాంట్రాక్టర్లకు నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ సూచించారు.

నర్సరీల్లో షిఫ్టింగ్, గ్రేడింగ్ చేపట్టాలి

నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో అంబుడ్స్‌మన్ కే శివరాం

తాండూర్, జూన్ 7 : హరితహారం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎప్పటికప్పుడు షిఫ్టింగ్, గ్రేడింగ్ చేయాలని మంచిర్యాల డీఆర్డీవో అంబుడ్స్‌మన్ కే శివరాం అధికారులను ఆదేశించారు. తాండూర్ పంచాయతీ పరిధిలో ఆయన శుక్రవారం ఆకస్మికంగా పర్యటించి. నర్సరీని పర్యవేక్షించారు. మొక్కల పెరుగుదల బాగుందన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈజీఎస్‌కు సంబంధించి 7 రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీసీఎస్ రాజ్ కుమార్, టీఏలు రాజేంద్రప్రసాద్, భార్గవ్, పంచాయతీ కార్యదర్శి తపస్‌కుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి

డీసీపీ అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఐఆర్‌సీఎస్ సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, మే 7 : రక్తదాన శిబిరాలు నిర్వహించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి కోరారు. ఈ మేరకు మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్‌ను శుక్రవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో నిల్వలు పూర్తిగా తగ్గాయని, తల సేమియా, సికిల్ సెల్ బాధితులకు ఇబ్బందుపుతున్నదని పేర్కొన్నారు. అనంతరం శాలువాతో డీసీపీని సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా కోశాధికారి సత్యపాల్ రెడ్డి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, ఎట్ల కిషన్, రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు కాసర్ల రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో బెల్లం అమ్మవద్దు

జన్నారం, జూన్ 7 : ప్రభుత్వం నిషేధించిన బెల్లాన్ని కిరాణా దుకాణాలోల అమ్మవద్దని లక్షెట్టిపేట ఎక్సైజ్ సీఐ నర్సింహులు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం పొనకల్ వర్తక సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కిరాణా దుకాణాల్లో బెల్లం అమ్మకం వల్ల, చుట్టు పక్కల గ్రామాలవారు తీసుకెళ్లి గుడుంబా తయారు చేస్తున్నారన్నారు. బెల్లం అమ్మాలనుకునేవారు దుకాణంలో 20 కిలోలే నిల్వ ఉంచుకొని, ఒక్కరికి కిలోకు మించి ఇవ్వవద్దని సూచించారు. వినియోగదారుడి ఆధార్‌కార్డు నంబర్ ఎంట్రీతో పాటు పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైనా తమ ఆదేశాలను అతిక్రమించిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు ఓజ్జల వామన్, కార్యదర్శి జక్కు రమేశ్, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేదాకా పోరాడుతాం

చెన్నూర్ టౌన్, జూన్ 7 : బాధితుడు, నిరుపేద దళిత సామాజిక వర్గానికి చెందిన ఎరుకల దేవయ్యకు న్యాయం జరిగే దాకా పోరాటం చేస్తామని ఐఎఫ్‌టీయూ చెన్నూర్ డివిజన్ అధ్యక్షుడు ఎం రమేశ్, జిల్లా నాయకుడు బీ గోపినాథ్, పీవోడబ్ల్యూ నాయకురాలు ఎం భవాని స్పష్టం చేశారు. తన భూమి బండారు చిన్నయ్య కబ్జా చేశారని గతంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆందోళన చేస్తున్న దేవయ్యకు వారు మద్దతు పలికారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. భూ ఆక్రమణ విషయమై చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో దేవయ్య గతంలో రెండుసార్లు ఫిర్యాదు చేసినా, స్పీడ్ పోస్ట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. బండారు చిన్నయ్య ఒక్క ఫిర్యాదు ఇవ్వగానే ఎరుకల దేవయ్యపైనా, ఆయన తరపున వచ్చిన వారిపైనా కేసులు నమోదు చేశారని మండిపడ్డారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్ : సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, బదావత్ సంతోష్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 7 : ఈనెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వరరావు, కాశబోయిన సురేశ్, జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీ నరసింహం, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యతో కలిసి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే డిపార్ట్‌మెంట్ అధికారులు, రూట్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులు, పోలీసు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 13 పరీక్షా కేంద్రాలు ఆసిఫాబాద్‌లో 6 కేంద్రాలు (1271 మంది అభ్యర్థులు), కాగజ్‌నగర్‌లో 7 కేంద్రాలు (1512 మంది అభ్యర్థులు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 10 గంటల తరువాత అనుమతించబోమని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. మహిళా అభ్యర్థులు ఆభరణాలు ధరించి రాకూడదని అన్నారు. అభ్యర్థులు బాల్‌పెన్, హాల్ టికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఐడీ కార్డు (ఆధార్/పాన్/డ్రైవింగ్‌లైసెన్స్) వెంట తెచ్చుకోవాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ అధికారులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను సందర్శించి, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరీక్షా సమయం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన వాటిల్లో నిర్ణయించిన ప్రశ్నాపత్రాలను తమకు కేటాయించిన కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు పోలీస్ బందోబస్తు నడుమ అందించాలని రూట్ అధికారులకు సూచించారు. తిరిగి పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో పట్టణాల్లో అన్ని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు, 3 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల కోసం బస్సులను సమయానుకూలంగా నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది అవసరమైన మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అభ్యర్థుల హాల్ టికెట్లో ఉన్న ఫోటోను, ఐడీ కార్డులో ఉన్న ఫొటోను పరీక్షించి అనుమతించాలని ఐడెంటిఫికేషన్ అధికారుకు సూచించారు. ఉదయం 9:30 నుంచి బయోమెట్రిక్ ద్వారా అభ్యర్థుల వేలిముద్రలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, జిల్లా అధికారులు, ఐడెంటిఫికేషన్, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 పరీక్షకు పటిష్ట బందోబస్తు..

పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అలాగే జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ : అదనపు కలెక్టర్ దీపక్ తివారి

గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష సంబంధిత ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్స్ జిల్లాకు చేరుకున్నాయని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో పూర్తి బందోబస్తు నడుమ భద్రపర్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గ్రూప్ -1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాలను ఒక రోజు ముందుగానే నిర్ధారించుకోవాలని సూచించారు. షూ, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని, అభ్యర్థికి సంబంధించిన వస్తువులను భద్రపర్చేందుకు ఎలాంటి సౌకర్యం కల్పించడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల జిల్లా సమన్వయకర్త లక్ష్మీనరసింహ, జిల్లా ఖజానా అధికారి రాజేశ్వర్, ఆసిఫాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. సతీష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మునావార్ షరీఫ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో కృషి చేయాలి..

నస్పూర్, జూన్ 7 : గ్రూప్ 1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లైయింగ్‌స్క్వాడ్, రూట్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాహుల్, పరీక్ష ప్రాంతీయ సమన్వయకర్త చక్రపాణితో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9,384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. డిపార్టుమెంటల్ అధికారులు, ఐడింటిఫికేసన్ అధికారులు పరీక్షకు ఒక రోజు ముందుగానే వారికి కేటాయించిన పరీక్షా కేంద్రాలను సందర్శించి, సీటింగ్ నిర్వహణ, తాగునీరు, సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించాలన్నారు. చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదని, ఎవరికి కేటాయించిన విధులు వారు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష రోజు ప్రశ్న పత్రాలు, సామగ్రి తీసుకునేందుకు రూట్ అధికారులు ఉదయం 6 గంటలకు ఉండాలని, తమ రూట్లను ఒక రోజు ముందు పరిశీలించాలని తెలిపారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లిన తర్వాత ఐడింటిఫికేషన్ అధికారుల విధులు ముగుస్తాయని, వారు పరీక్ష కేంద్రంలో ఉండకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను చేర్పించాలి

బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని మండలాల విద్యాధికారులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నది. ఈ సందర్భంగా ఆయా చోట్ల శుక్రవారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీలు తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఉచిత పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, వివిధ రకాల స్కాలర్షిప్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. అప్పటికప్పుడే విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్నారు. - తాండూర్/కాసిపేట/

కొనసాగుతున్న బడిబాట

కౌటాల/కోటపల్లి/భీమారం/హాజీపూర్/వాంకిడి/రామకృష్ణాపూర్, జూన్ 7

- తాండూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట నిర్వహించామని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ, బడీడు పిల్లల పేర్లను నమోదు చేసుకుంటున్నారన్నారు. వారి జాబితాను తయారు చేసి, సంబంధిత రిజిస్టర్లలో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో బడిబాట కార్యక్రమం నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.
- కాసిపేట మండలం దేవాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి బడీడు విద్యార్థులను గుర్తించి అడ్మిషన్స్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ హెచ్ఎం, మండల నోడల్ ఆఫీసర్ రమేశ్ రాథోడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ ప్రియాంక, ఉపాధ్యాయులు సురేష్ బాబు, అమ్జద్ పాషా, లచ్చన్న, రాజేశ్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మల్లేశ్, రమేశ్, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- కౌటాల మండలంలోని ముత్తంపేట, కౌటాల గ్రామాల్లో ఉపాధ్యాయులు 2వ రోజు బడిబాట నిర్వహించారు. ర్యాలీలు తీసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తంపేట హెచ్ఎం హన్మంతు, కౌటాల సీనియర్ ఉపాధ్యాయుడు రమేశ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణతో పాటు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.
- కోటపల్లి బడిబాట కొనసాగుతున్నది. ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి, బడీడు పిల్లల వివరాలను సేకరించారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి, ఐదేండ్లు నిండిన పిల్లల వివరాలు నమోదు చేసుకున్నారు.
- భీమారం మండలంలోని గోత్రల గూడెం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పలు కాలనీల్లో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మూడేండ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీకి పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద తదితరులు ఉన్నారు.
- హాజీపూర్ మండలంలోని కొలాంగూడలో బడిబాట ర్యాలీ తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు, అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని దొనబండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- వాంకిడి మండలం ంద్రానగర్‌లో ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్ఎం వినేశ్, ఎంఈవో మానుకుమార్ బడిబాట ర్యాలీ తీశారు. ఉపాధ్యాయుడు, ఐకేపీ సీసీలు వేణు, భీంరావ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శైలజ తదితరులు పాల్గొన్నారు.
- మందమర్రి మండలంలోని పులిమడుగు పంచాయతీ పరిధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో భీరయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ : కాసిపేటలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాజీపూర్ : కొలాంగూడలో..

వాంకిడి : ఇంద్రానగర్‌లో..

వందేండ్ల చెరువు అధ్వానం

వందేండ్ల చరిత్ర కలిగిన భీమారం మండలం నర్సింగాపూర్ ఊర చెరువు.. దీనస్థితికి చేరుకున్నది. ఎంతోమంది రైతులకు జీవనాధారం చూపగా.. నేడు పూర్తి నిర్లక్ష్యానికి గురై అధ్వానంగా తయారైంది. పూడిక కూరుకుపోయి మరమ్మతులు లేక, అభివృద్ధి పనులు లేక నిరుపయోగంగా మారింది. దీంతో 250 ఎకరాలకు సాగు నీరు లేక 150 మంది రైతులు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతాంగం కంటతడిపెడుతున్నది.

- భీమారం, జూన్ 7

- ధ్వంసమైన మత్తళ్లు.. కూలిపోయిన తూములు
- పూడిక తీయక.. నీరు నిల్వక..
- పట్టించుకోని అధికారులు
- 150 మంది రైతులకు జీవనాధారం
- నర్సింగాపూర్ చెరువును కాపాడాలని వేడుకుంటున్న రైతాంగం

ధ్వంసమైన మత్తడి

చుక్క నీరు లేకుండా ఉన్న నర్సింగాపూర్ ఊర చెరువు

భీమారం మండలం నర్సింగాపూర్ ఊర చెరువును వందేండ్ల కింద ఎన్‌వీ రాజిరెడ్డి అనే దాత నిర్మించినట్లు రైతులు చెప్తున్నారు. దీని కింద సుమారు 250 ఎకరాల ఆయకట్టు ఉండగా, 150 రైతులు సాగు చేసుకుంటూ బతుకుతున్నారు. అందరూ చిన్న, సన్నకారు రైతులే కావడం.., బోర్లు, విద్యుత్ కనెక్షన్లు లేవు, ఈ చెరువు నిండితే పంటలు పండుతాయి. అయితే చెరువు నిర్మించినప్పటి నుంచి ఏ పనులూ సాగలేదని అంటున్నారు. రెండేండ్ల కింద అధిక వర్షాల ప్రభావంతో వరద ఎక్కువ వచ్చి, ఉన్న రెండు తూములు కూలిపోయాయి. పెద్ద రంధ్రం ఏర్పడి, నీరు నిల్వ లేకుండా పోతున్నది. ఈ చెరువుకు మూడు మత్తడులు ఉండగా, పూర్తిగా ధ్వంసమయ్యాయి. పూడిక పెరిగి నీరు ఆగడంలేదు. రెండేండ్లుగా నీరు నిల్వలేకపోవడంతో రైతులు పంటలు సాగవడంలేదు. దీంతో 150 మంది రైతులు రోడ్డు పడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోడంలేదని ఆందోళన చెందుతున్నారు. మూడేండ్ల కింద చేపల కోసం చెరువును వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన 20 మంది రైతులు రూ.1.26 లక్షలకు దక్కించుకున్నారు. అందులో నీరు లేకపోవడంతో చేపలు చనిపోయాయి. కాగా, చెరువుకు మత్తడితో పాటు, తూములు, పూడికతీత పనులు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

మూడు మత్తళ్లు ధ్వంసం..

ఈ చెరువు కింద నాకు రెండెకరాల భూమి ఉంది. బోర్లు, బావులు లేవు. చెరువు నిండితేనే పంట పండించుడు. రెండేండ్లుగా నీరు లేక పంటలు సరిగా పండడంలేదు. ఈ చెరువుకు ఉన్న మూడు మత్తళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ సమస్యపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించినం. ఇప్పటి వరకు ఏ చర్యలూ తీసుకోలే. ఈ చెరువును బాగుచేస్తేనే మాకు పంటలు వేసుకునేందుకు ఉంటుంది. అధికారులు స్పందించి చెరువు పనులు చేపట్టాలి.

- గాదరవేణి మల్లేశ్, ఆయకట్టు రైతు

రూ.40 లక్షలకు ఎస్టిమేట్ పెట్టాం..

జనవరిలో అధికారులు వచ్చి ఈ చెరవును పరిశీలించారు. ఫిబ్రవరిలోనే ఎస్టిమేషన్ వేసి ఇచ్చాం. హైదరాబాద్ హెడ్ ఆఫిస్‌కు ఫైల్ పోయింది. అక్కడే ఆలస్యమైంది. అక్కడి అధికారుల రిటైర్మెంట్ ఉండడంతో పాటు, ఎలెక్షన్ కోడ్ ఉండడంతో ఆలస్యమైంది. హైదరాబాద్ హెడ్ ఆఫిస్ ఎస్ఈ ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్‌లో ఫైల్ ఉన్నది. అక్కడికి అధికారులు కొత్త వారు వచ్చారు. అధికారులు వచ్చి తనిఖీలు చేయగానే పనులు పూర్తి చేస్తాం.

- సీహెచ్ అఖిల్, ఇరిగేషన్ ఏఈ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, జూన్ 7 : సిర్పూర్, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కౌటాల సబ్ డివిజన్ ఏడీఈ రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ మండలం లక్ష్మీపూర్ నుంచి లోనవెల్లి సబ్ స్టేషన్ వరకు 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, మెయింటనెన్స్ పనులు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేటలో..

కాసిపేట, జూన్ 7 : కాసిపేట మండలంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కాసిపేట విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జూన్ 7 : మండలంలోని దేవులవాడ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. కిష్టంపేట నుంచి దేవులవాడకు వెళ్లే 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హాజీపూర్‌లో..

హాజీపూర్, జూన్ 7 : మండలంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని హాజీపూర్, టీకానపల్లి, దొనబండ, పెద్దంపేట, బుద్దిపల్లి, కొండాపూర్, కర్ణమామిడి, పడ్తన్‌పల్లి, రాంపూర్ గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, జూన్ 7 : అందుగుల పేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ టౌన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా జీఎం ఆఫీసు, యాపల్, కేకే-2, ఊరు మందమర్రి, టోల్ ప్లాజా, మార్కెట్, దీపక్ నగర్, పాలచెట్టు, దొరలబంగ్లా, ఊరు రామకృష్ణపూర్, కాళీ క్యాంప్, పులిమడుగు, అందుగులపేట, కోటేశ్వరరావు పల్లి, బొక్కల గుట్ట, సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మల్లేశం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, జూన్ 7 : కాగజ్‌నగర్ పట్టణంలోని 33/11 సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలో విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఇంటర్ ఎంపిక జాబితా విడుదల

కాసిపేట, జూన్ 7 : కాసిపేట మండలం తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్ పొందే విద్యార్థుల ఎంపిక జాబితాను ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య పేర్కొన్నారు. ఈ జాబితాను కళాశాల నోటీస్ బోర్డ్‌పై ఉంచినట్లు, వ్యక్తిగతంగా విద్యార్థులకు మెసేజ్ ద్వారా సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. మెరిట్ జాబితాలో సీటు సాధించిన విద్యార్థులు టీసీ, బోనఫైడ్, కుల ధ్రువీకరణ పత్రాలతో 11వ తేదీలోగా అడ్మిషన్ పొందాలని సూచించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 7 : ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం మండల నోడల్ అధికారి ఉదయ్ బాబు పంపిణీ చేశారు. మండలంలోని 14 యూపీఎస్, యూఆర్ఎస్ 2, పీఎస్ 2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఎంఐఎస్ సంతోష్ కుమార్